**నీలగిరి ఎక్స్‌ప్రెస్**

RNI - TELTEL/2023/87644

తెలుగు దిన పత్రిక


## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

నీతిగాను బ్రతుకు,సత్యమే పలుకుము
మంచిమాటలాడు మానవుండ
నీతి,నిజము,మంచి నిత్యమ్ము నిన్ననూ
కాచునంట వినుము కచ్చితముగ


మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 14 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 18-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# ఎబోలా వైరస్ కలకలం

## కాంగోలో 88 మంది మృతి

- ఆఫ్రికా దేశం కాంగోలో మరోసారి కలకలం
- ఈ రకం వైరస్‌కు టీకా అందుబాటులో లేదని అధికారులు హెచ్చరిక
- హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యూహెచ్ఓ
- మరణాల శాతం ఎక్కువ : వైద్య అధికారులు

**కాంగో:**
ప్రాణాంతక ఎబోలా వైరస్ ఆఫ్రికా దేశం కాంగోలో మరోసారి కలకలం రేపుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఆరోగ్య సంక్షోభాన్ని అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ఆదివారం ప్రకటించింది. ఈ రకం వైరస్‌కు టీకా అందుబాటులో లేదని అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది.కాగా, అత్యంత వేగంగా వ్యాపించే ఎబోలా వైరస్

-మిగతా 2 లో



ఒప్పందానికి రాకపోతే

# బ్యాడ్ టైమే

- ది తుఫాన్ ముందు ప్రశాంతత..
- ఇరాన్‌కు ట్రంప్ తాజా హెచ్చరిక
- యుద్ధం ముగింపునకు 5 షరతులు

**వాషింగ్టన్,**
ఇరాన్‌కు చాలా క్లిష్టతరమైన సమయం రాబోతున్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్‌పై అమెరికా దాడులను పునరుద్ధరిస్తుందని వస్తున్న వార్తల నేపథ్యంలో యూఎస్ నేవీ అడ్మిరల్‌తో కలిసి ఉన్న ఒక ఏఐ చిత్రాన్ని ఆయన సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు. తుఫాన్‌తో అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలో కొన్ని ఓడలు ఉన్న బ్యాక్‌గ్రౌండ్‌తో వీరిద్దరూ ఉన్నారు. ఆ చిత్రంలో ట్రంప్ కుడిచేయి పైకెత్తి చూపుడువేలుతో చూపిస్తూ హెచ్చరిస్తున్నారు. ఈ చిత్రంలో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ జెండాను ఎగురవేస్తున్న దృశ్యం కన్పిస్తున్నది. అలాగే చిత్రంపై 'తుఫాన్‌కు ముందు ఉండే ప్రశాంతత ఇది' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, శాంతి ఒప్పందం కుదుర్చుకోకపోతే ఇరాన్ చాలా దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్ మరోసారి హెచ్చరించారు. ఫ్రెంచ్ బ్రాడ్‌కాస్టర్ బీఎఫ్ఎంటీవీతో టెలిఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ త్వరలో శాంతి ఒప్పందానికి కనుక రాకపోతే ఈసారి ఇరాన్ అతి చెడ్డ సమయాన్ని

-మిగతా 2 లో



ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో

# నిప్పుల వర్షమే!

- తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక
- మే 19 నుంచి 24 వరకు అత్యంత తీవ్రంగా వడగాలులు
- 45 డిగ్రీలు దాటి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని సూచన
- వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, రోగులు మరింత అప్రమత్తంగా ఉండాలని సలహా

**హైదరాబాద్**
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండలు దంచికొట్టనున్నాయి. రానున్న వారం రోజుల పాటు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మే 19 నుంచి 24వ తేదీ వరకు ఆరు రోజుల పాటు భానుడి ప్రతాపం చుక్కలు చూపించనుందని, బలమైన వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ రోజుల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి రికార్డు స్థాయిలో నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, ఈ ఆరు రోజుల్లో వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండనుంది. దీనివల్ల వడదెబ్బ తగిలి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం

-మిగతా 2 లో

గురుకులాలు, వసతి గృహ పాఠశాలలకు

# 'భవన అద్దె'

## 'డైట్' మరియు 'కాస్మెటిక్స్' నిధుల విడుదల

- నాణ్యమైన విద్యా వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ అడుగు
- మెరుగైన నివాస సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.
- సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం'
- నెలవారీ చెల్లింపుల విధానం అమలు

**రూ. 221.24 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం**



**హైదరాబాద్**
రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహ పాఠశాలల నిర్వహణకు ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ సంక్షేమం మరియు విద్యా శాఖల పరిధిలోని నివాస విద్యాసంస్థలకు సంబంధించిన ఆహార వ్యయాలు (డైట్ ఛార్జీలు), కాస్మెటిక్స్ ఖర్చులు, భవన అద్దెలను ఇకపై ప్రతి నెలా సకాలంలో విడుదల చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సామాజికంగా వెనుకబడిన, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ అడుగు వేసింది. గతంలో ఈ నిధుల చెల్లింపుల్లో 8 నుంచి 9 నెలల వరకు ఆలస్యం కావడం వల్ల నివాస పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి.

-మిగతా 2 లో

# శంకుస్థాపనకు రండి..

- సీఎం రేవంత్ కు యాదాద్రి అర్చకులు, అధికారుల ఆహ్వానం
- సరస్వతీ అంత్య పుష్కరాలకు సైతం ఇన్విటేషన్ అందజేత



2 లో

# నేటి నుంచే 'పర్యాటక వారోత్సవాలు'



- పర్యాటక సొగసుల 'తెలంగాణ'గా నిర్వహణ
- 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'తో పర్యాటక రంగానికి సరికొత్త కళ
- పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ సంపదను, పర్యాటక శోభను ప్రపంచానికి చాటిచెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 18 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

-మిగతా 2 లో

ప్రభుత్వ పాఠశాలల్లో

# అల్పాహారం పథకం

- రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్**
ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన విద్యా

-మిగతా 2 లో



బండి సంజయ్‌ని

# బర్తరఫ్ చేయాల్సిందే

- ఆడబిడ్డకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ అండగా నిలిచింది :
- కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేసి అనంతరం విచారణను ఎదుర్కోవాలి
- రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేయడమే పనిగా పెట్టుకుంది
- హైదరాబాద్‌లో నిర్వహించిన 'నా బూత్-నా భవిష్యత' కార్యక్రమంలో కేటీఆర్

**హైదరాబాద్,**
కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాల్సిందేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మైనర్ బాలికకు అన్యాయం జరిగిన సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోయినా ఆ తల్లి, కూతురికి న్యాయం జరిగేలా అండగా నిలిచిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని వనస్థలిపురం డివిజన్ పరిధిలోని జీఎస్ఆర్ గార్డెన్స్‌లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'నా బూత్–నా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణా

-మిగతా 2 లో



# ఢిల్లీకి ఎండ గండం.

- ఇప్పటికే ఉడుకుతున్న ఢిల్లీ..
- ఎండలు ఇంకా పెరుగుతాయన్న ఐఎండీ
- ఈ వారంమంతా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరనున్నట్లు వెల్లడి

**న్యూఢిల్లీ**
దేశరాజధాని ఢిల్లీ ఇప్పటికే అత్యధిక ఉష్ణోగ్రతలతో అట్టుడికిపోతోంది. ఎండలు మండిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అలాంటిది రాబోయే రోజుల్లో ఎండలు ఇంకా పెరుగుతాయని ఐఎండీ (భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. సోమవారం నుంచి ఈ వారంమంతా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరనున్నట్లు వెల్లడించింది. అలాగే, భారీగా వడగాడ్పులు వీస్తాయని కూడా హెచ్చరించింది. దీని ప్రకారం.. ఎండలో బయటకు వెళ్లడం అసౌకర్యంగా కాదు.. ప్రమాదకరమే అని నిపుణులు అంటున్నారు.ఇప్పటికే ఢిల్లీలో 40 డిగ్రీలకు పైగా ఎండకాస్తోంది. శనివారం 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వేడినే ఢిల్లీ ప్రజలు తట్టుకోలేకపోతున్నారు.

-మిగతా 2 లో

భారత్ చేతిలో

# కిల్లర్ మిస్సైల్..

## చైనా నౌక 'ఫుజియాన్' ను నిమిషాల్లో ధ్వంసం చేయగలదు!

- భారత అమ్ములపొదిలో 'ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కిల్లర్' క్షిపణి
- గంటకు 12,000 కిలోమీటర్ల వేగం, 1,500 కిలోమీటర్ల దాడి పరిధి
- చైనాకు చెందిన అత్యాధునిక ఫుజియాన్ క్యారియర్‌ను సైతం ధ్వంసం చేయగల సామర్థ్యం
- డీఆర్డీఓ అభివృద్ధి.. త్వరలో నౌకాదళంతో యూజర్ ట్రయల్స్ ప్రారంభం
- హిందూ మహాసముద్రంలో గణనీయంగా పెరగనున్న భారత సైనిక శక్తి

**న్యూఢిల్లీ,**
రక్షణ రంగంలో స్వయం సమృద్ధి దిశగా భారత్ మరో భారీ ముందడుగు వేసింది. శత్రు దేశాల భారీ యుద్ధ నౌకలను, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లను సైతం సముద్రంలోనే జలసమాధి చేయగల అత్యంత శక్తివంతమైన హైపర్ సోనిక్ క్షిపణిని అభివృద్ధి చేసింది. దీనిని 'ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కిల్లర్'గా అభివర్ణిస్తున్నారు. హిందూ మహాసముద్రంలో చైనా కదలికలకు చెక్ పెట్టేలా దీనిని రూపొందించడం విశేషం. రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) ఈ లాంగ్ రేంజ్ యాంటీ–షిప్ హైపర్ సోనిక్ మిస్సైల్ (ఎల్ఆర్–ఏఎస్ హెచ్ఎం)ను దేశీయంగా

-మిగతా 2 లో



# ఎబోలా వైరస్ కలకలం

మొదటి తరువాయి

కారణంగా కాంగోలో 88 మంది మరణించారు. మరో 336 మందికి ఎబోలా వైరస్ సోకిందని ఆఫ్రికాలోనే అతిపెద్ద ప్రజారోగ్య కేంద్రం సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) శనివారం తెలిపింది. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తమైంది. బండిబుగ్యో ఎబోలా వైరస్ రకం వల్ల సంభవించిన ఈ వ్యాప్తి అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే విషయమని డబ్ల్యూహెచ్ఓ అభిప్రాయపడింది. ఎబోలా కేసుల సంఖ్య, వ్యాప్తి వాస్తవ పరిస్థితిపై స్పష్టత లేదని తెలిపింది. ఈ క్రమంలో అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా, ఇది అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనల ప్రకారం రెండో అత్యున్నత హెచ్చరిక స్థాయి.

కాంగోలో ఆందోళనకరంగా వైరస్ వ్యాప్తి : డబ్ల్యూహెచ్ఓ

ఎబోలా సంక్రమించిన వ్యక్తుల వాస్తవ సంఖ్య, భౌగోళిక వ్యాప్తికి సంబంధించి క్లారిటీ రావాల్సి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ ఎబోలా వైరస్ వల్ల ప్రపంచ దేశాలకు తక్షణ ముప్పు లేకపోయినా, కాంగో పొరుగు దేశాలకు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇప్పటికే కాంగోలో ఎబోలా వైరస్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది.

**కాంగో హెల్త్ మినిస్టర్ ఏమన్నారంటే?**

తమ దేశంలో ఎబోలా వైరస్ వ్యాప్తిపై కాంగో ఆరోగ్య మంత్రి శామ్యూల్ రోజర్ కంబా స్పందించారు. బుండిబుగ్యో రకం ఎబోలా వైరస్‌కు వ్యాక్సిన్ లేదన్నారు. ఈ వైరస్ వ్యాప్తికి నిర్దిష్ట చికిత్స లేదని చెప్పారు. ఈ వైరస్ సోకిన మొదటి రోగి ఒక నర్సు అని తెలిపారు. ఆమె ఈ ఏడాది ఏప్రిల్ 24న ఇటూరి ప్రావిన్స్ రాజధాని బునియాలోని ఒక ఆరోగ్య కేంద్రానికి ఎబోలా లక్షణాలతో వచ్చారని వెల్లడించారు. ఈ వ్యాధి సోకితే జ్వరం, రక్తస్రావం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయని ఖ.

ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందడాన్ని అత్యంత ఆందోళనకరంగా వైద్య సహాయక బృందం డాక్టర్స్ విథౌట్ బోర్డర్స్ (ఎంఎస్ఎఫ్) పేర్కొంది. ఇంత తక్కువ సమయంలో ఇన్ని ఎబోలా కేసులు నమోదవ్వడం, మరణాలు అత్యంత ఆందోళన కలిగించే విషయమని అభిప్రాయపడింది. ఈ సంస్థ ప్రస్తుతం ఎబోలా వైరస్ వ్యాప్తి చెందిన ఇటూరి ప్రాంతానికి వైద్య, సహాయక సిబ్బందిని తరలిస్తోంది.

## ఒప్పందానికి రాకపోతే

# బ్యాడ్ టైమే

మొదటి తరువాయి

ఎదుర్కొంటుందని హెచ్చరించారు. కాగా, ఇరాన్‌పై తీవ్రస్థాయిలో దాడులు చేసేందుకు పెంటగాన్ సన్నాహాలు చేస్తున్నదని, ఈసారి అధికారికంగా యుద్ధం పేరును 'ఆపరేషన్ స్లెడ్జ్‌హ్యామర్'గా మార్చేందుకు యోచిస్తున్నదని ఒక మిలిటరీ ఉన్నత అధికారి తెలిపారు.

ఇరాన్‌కు ఐదు షరతులు..

యుద్ధం ముగింపుపై అమెరికా, ఇరాన్ మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయి. ఇరు వర్గాల మధ్య చర్చలకు సంబంధించి ఇరాన్ పంపిన ప్రతిపాదనలపై అమెరికా ఐదు షరతులు విధించినట్టు 'ఇరాన్ మీడియా' తెలిపింది. అమెరికా నుంచి ఎలాంటి స్పష్టమైన రాయితీలు అందులో లేవని, చర్చల్లో ప్రతిష్ఠంభనకు దారితీస్తున్నదని ఇరాన్ నాయకత్వం పేర్కొన్నది. అమెరికా పంపిన షరతుల జాబితాను 'ఫార్స్ న్యూస్ ఏజెన్సీ' విడుదల చేసింది. దీని ప్రకారం, ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో ఒక్కదానికి మాత్రమే 'నిర్వహణ'కు అమెరికా అనుమతించింది. శుద్ధి చేసిన యురేనియం నిల్వలన్నీ అమెరికాకు స్వాధీనం చేయాలన్నది మరో షరతు. విదేశాల్లోని ఇరాన్ ఆస్తుల్లో 'కనీసం 25' శాతం కూడా విడుదల చేయబోమని యూఎస్ తెలిపింది. ఇరాన్ యుద్ధ నష్టాలకు పరిహారం ఉండదని పేర్కొన్నది. చర్చలు ప్రారంభంతోనే.. అంతటా ఘర్షణలు ఆపాలన్నది అమెరికా విధించిన ఐదవ షరతు.

# గురుకులాలు, వసతి గృహ పాఠశాలలకు 'భవన అద్దె'

మొదటి తరువాయి

ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇందులో భాగంగా మొదటి త్రైమాసిక (మూడు నెలలకోసారి) చెల్లింపుల విధానాన్ని తీసుకువచ్చి, ప్రస్తుతం దాన్ని నెలవారీ చెల్లింపుల విధానంగా మార్చారు. 2026-27 బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలోనే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ కీలక మార్పును ప్రకటించడం గమనార్హం. ఈ నిర్ణయం వల్ల విద్యార్థులకు నిరంతరాయంగా పోషకాహారం అందడంతో పాటు హాస్టళ్ల సక్రమ నిర్వహణ, భవనాల అద్దెల చెల్లింపులు సాఫీగా సాగనున్నాయి. ఇది విద్యార్థుల విద్యా ఫలితాలను, పాఠశాలల వాతావరణాన్ని మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడుతుంది. నెలవారీ చెల్లింపుల నిర్ణయంలో భాగంగా.. వివిధ సంక్షేమ, విద్యా శాఖల పరిధిలోని వసతి గృహ విద్యాసంస్థల ఆహార, కాస్మెటిక్స్ ఖర్చులు, భవన అద్దెల కోసం ప్రభుత్వం రూ. 221.24 కోట్లను విడుదల చేసింది. ఈ నిధుల విడుదల ద్వారా వసతి గృహ పాఠశాలల్లోని విద్యార్థుల పోషణ, సంక్షేమం మరియు వసతి సదుపాయాలకు పూర్తి స్థాయిలో నిరంతర మద్దతు లభించనుంది. "అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన నివాస సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సాధికారత సాధించడమే కాకుండా, వారిని సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో

# నిప్పుల వర్షమే!

మొదటి తరువాయి



ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తాగునీటి బాటిల్స్ ను వెంట ఉంచుకోవాలని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్ కు గురికాకుండా ఉండేందుకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, రోగులు ఈ కాలంలో ఎండకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండటం శ్రేయస్కరం.

# శంకుస్థాపనకు రండి.

**-సీఎం రేవంత్ కు యాదాద్రి అర్చకులు, అధికారుల ఆహ్వానం**
**-సరస్వతీ అంత్య పుష్కరాలకు సైతం ఇన్విటేషన్ అందజేత**

**తెలంగాణ బ్యూరో:**
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఏర్పాటు చేయబోయే శ్రీ లక్ష్మీనరసింహస్వామి వేద పాఠశాల శంకుస్థాపన కార్యక్రమానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దేవస్థానం అర్చకులు, అధికారులు ఆహ్వానించారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయనను మంత్రి కొండా సురేఖ, యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు కలిసి ఆహ్వానించారు. ఈ నెల 23న యాదగిరిగుట్టలో శ్రీలక్ష్మీనరసింహస్వామి వేద పాఠశాల, దేవస్థాన ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి,



ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీశంకర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. అదేవిధంగా ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరగనున్న సరస్వతీ అంత్య పుష్కరాలకు రావాల్సిందిగా మంత్రి కొండా సురేఖ, శ్రీకాళేశ్వర ముక్తేశ్వరస్వామి దేవస్థాన అర్చకులు సీఎంను ఆహ్వానించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో

# అల్పాహారం పథకం

మొదటి తరువాయి

వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి... ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య, మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం పథకం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. విద్య ద్వారానే సమాజ వికాసం సాధ్యమని పేర్కొన్న మంత్రి... జగిత్యాల జిల్లా పదో తరగతి ఫలితాల్లో 98.88 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో నాలుగో స్థానం సాధించిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 8 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్ పాటి, వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి ఎండ గండం.

మొదటి తరువాయి

అలాంటిది మరో ఐదు డిగ్రీల ఎండలు పెరగడమంటే సాధారణ విషయం కాదు. ఢిల్లీ వైపు తూర్పు నుంచి వీచే గాలుల దిశ మారడం వల్లే ఈ పరిస్థితి ఉందని నిపుణులు అంటున్నారు. ఈ గాలులు కాస్త చల్లదనాన్ని, తేమను అందిస్తాయి. కానీ, ఇప్పుడు రాజస్థాన్, పాకిస్తాన్ నుంచి వాయువ్య దిశలో వేడి గాలులు వీస్తుండటం వల్ల ఎండ, వేడి పెరుగుతోందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ గాలుల్లో ఎలాంటి తేమ ఉండదు. ఈ కారణంగా ఎండలు దాదాపు నాలుగైదు డిగ్రీలు పెరగవచ్చు. మే 23 వరకు ఇదే తరహా ఎండలు కాసే అవకాశం ఉంది. ఢిల్లీలోనే కాకుండా పంజాబ్, హరియాణా, చండీగఢ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, విదర్భ, చత్తీస్‌గఢ్‌లకు కూడా భారీ ఎండలు తప్పవని ఐఎండీ తెలిపింది. విదర్భలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే 46 డిగ్రీల ఎండ నమోదవుతోంది. ఢిల్లీలో రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణ స్థాయికి మించి పెరిగే అవకాశం ఉంది. ఇదే సమయంలో ఢిల్లీలో వీలైనంత వరకు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పించాలని సీఎం రేఖా గుప్తా.. ప్రైవేటు కంపెనీలకు సూచించారు.

# నేటి నుంచే 'పర్యాటకవారోత్సవాలు'

మొదటి తరువాయి



పర్యాటక శాఖ ఆధ్వర్యంలో... భాషా సాంస్కృతిక, పురావస్తు (హెరిటేజ్) శాఖలు, నిథమ్ సంస్థల సంయుక్త సమన్వయంతో ఈ ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్నారు. ఈ వారోత్సవాల ప్రారంభం సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 10:00 గంటలకు జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో అడ్మిషన్ల, కెరీర్ గైడెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 4:00 గంటలకు అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని స్టేట్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారు. ఇదే వేదికపై కొలనుపాక సైట్ మ్యూజియం, ఆలంపూర్ సైట్ మ్యూజియం ప్రత్యేక బ్రోచర్లతో పాటు, 'టూరిస్ట్ గైడ్ ఇన్ తెలంగాణ' పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరిస్తారు. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యం. ఎకో-టూరిజం ప్రదేశాలను ప్రమోట్ చేయడంతో పాటు, పర్యాటక రంగం ద్వారా యువతకు లభించే ఉపాధి అవకాశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నారు. చారిత్రక కట్టడాల ప్రాశస్త్యాన్ని వివరించేలా ప్రత్యేక కార్యక్రమాలు అలాగే ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత డ్రైవ్‌లు చేపడతారు. సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లతో డిజిటల్ ప్రచారం కింద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అంతే కాకుండా జిల్లా స్థాయిల్లో పర్యాటక ప్రాధాన్యతపై ప్రత్యేక సదస్సులు, ప్రచారాలు నిర్వహిస్తారు. అలాగే జిల్లాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతితో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా విస్తృత ఏర్పాట్లు చేశారు. జానపద కళా ప్రదర్శనలు, వీరత్వానికి ప్రతీక అయిన పేరిణి నృత్యం, శాస్త్రీయ నృత్యాలు, సాహిత్య కార్యక్రమాలు, సంగీత కచేరీల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

# బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాల్సిందే

మొదటి తరువాయి

కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోగా, కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలికిందని విమర్శించారు.

అలాంటి పరిస్థితుల్లో బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలిచి కొంత మేర న్యాయం జరిగేలా కృషి చేసిందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేసి అనంతరం విచారణను ఎదుర్కోవాలని డిమాండ్ చేశారు. పార్టీ బలోపేతంలో బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర కీలకమని, ప్రతి కార్యకర్త శిక్షణ తీసుకుని సమర్థంగా పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేయడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. 30 నుంచి 40 ఏండ్లుగా నివసిస్తున్న ప్రజల ఇండ్లను కూల్చివేస్తున్నారని, కానీ వారికి ఇండ్లు కట్టించే బాధ్యత మాత్రం తీసుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.1200 కోట్లతో తెలంగాణలో కిమ్స్ ఆస్పత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అందులో భాగంగానే ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేటలో మల్టీ స్పెషాలిటీ కిమ్స్ ఆస్పత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. పార్టీ సభ్యత్వాలను మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయాలని, ఎక్కువ సభ్యత్వాలు నమోదు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికే కార్పొరేటర్ టికెట్లు దక్కుతాయని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రెండున్నర సంవత్సరాల్లో భూముల ధరలు, రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతిన్నాయని, మళ్లీ కేసీఆర్ నాయకత్వం వస్తే ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్, మహమ్మద్ అలీ, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తలసాని సాయికిరణ్, కమల సుధీర్‌రెడ్డి, గజ్జల సుష్మా మధు సూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జట్టా రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారత్ చేతిలో కిల్లర్ మిస్సైల్...

మొదటి తరువాయి

అభివృద్ధి చేసింది. ఇది సుమారు 1,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. గంటకు దాదాపు 12,000 కిలోమీటర్ల (మాక్ 8 నుంచి 10) అసాధారణ వేగంతో ప్రయాణించడం దీని అతిపెద్ద బలం. ఈ వేగం కారణంగా శత్రువుల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు దీనిని గుర్తించి అడ్డుకోవడం దాదాపు అసాధ్యం. ఒక వేళ రాడార్ పై కనిపించినా, శత్రు దేశాలు స్పందించేలోపే లక్ష్యాన్ని ఛేదించగల సామర్థ్యం ఆ మిస్సైల్ సొంతం. ఇది 1500 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 7 నిమిషాల 30 సెకన్లలోనే చేరుకుంటుంది అంటే దీని సత్తా ఏంటో అర్థమవుతుంది. చైనా నిర్మించిన అత్యాధునిక




'ఫుజియాన్' విమాన వాహక నౌకను కూడా ఇది నిమిషాల్లో ధ్వంసం చేయగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ క్షిపణి, భారత నౌకాదళంతో యూజర్ ట్రయల్స్ కు సిద్ధమవుతోంది. ఇటీవల ఒడిశా తీరంలో జరిపిన పరీక్షలు విజయవంతమయ్యాయి. 2027-28 మధ్యలో తుది ట్రయల్స్ ప్రారంభించి, 2029-30 నాటికి పూర్తిస్థాయిలో నౌకాదళంలోకి ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంలో భాగంగా రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు ఓ కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ క్షిపణి వ్యవస్థ అందుబాటులోకి వస్తే హిందూ మహాసముద్రంలో భారత భద్రతా సామర్థ్యం, నిరోధక శక్తి కొత్త శిఖరాలకు చేరుకుంటాయి. సముద్ర తీర ప్రాంత రక్షణ మరింత పటిష్టం కానుంది.

# సోమవారం రాశి ఫలాలు






**మేషరాశి**
పాత సంఘటనలు గుర్తు చేసుకుంటారు. గృహమున సొంత ఆలోచనలు అమలు చేస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ యోగం ఉన్నది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఇంటి దేవత ఆరాధన శుభకరం

**వృషభరాశి**
బంధువులతో అకారణ మాట పట్టింపులు ఉంటాయి. విలువైన పత్రాల విషయంలో జాగ్రత్త వహించాలి. కుటుంబ పెద్దల ఆరోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. పితృదేవుల ఆరాధన శుభకరం

**మిథునరాశి**
బంధుమిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు. సమాజంలో పరపతి పెరుగుతుంది. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగాలలో ఒడిదుడుకులు అధిగమిస్తారు. కులదేవత ఆరాధన శుభకరం

**కర్కాటకరాశి**
సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కీలక వ్యవహారాలలో పెద్దలు సలహాలు తీసుకుని ముందుకు సాగుతారు. ప్రత్యర్థులు మిత్రులుగా మారి సహాయ సహకారాలు అందిస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వ్యాపారస్తులకు ఆశించిన లాభాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. ఇష్టదైవం ఆరాధన శుభకర

**సింహరాశి**
ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యమైన పనులలో అవరోధాలు తప్పవు. కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు నెలకొంటాయి. వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది. శివనామ స్మరణ శుభకరం

**కన్యరాశి**
ఆర్థిక వ్యవహారాలు సామాన్యంగా సాగుతాయి. బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన శిరో బాధలు తప్పవు. వ్యాపారాలు మందగిస్తాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఉద్యోగాలలో అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. సంతానం విద్యా విషయాలలో దృష్టి సారించడం మంచిది. గురు ఆరాధన శుభకరం

**తులరాశి**
సన్నిహితుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారస్థులు నూతన పెట్టుబడులు అందుకుంటారు. సోదరుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాదిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. విష్ణు నామం ఆరాధన శుభకరం

**వృశ్చికరాశి**
భూ సంబంధిత క్రయవిక్రయాలలో ఆశించిన లాభాలు పొందుతారు. బంధు మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో చర్చలు అనుకూలిస్తాయి. మిత్రులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలించినట్టు అవకాశాలు లభిస్తాయి. దుర్గాదేవి నామస్మరణ శుభకరం

**ధనస్సురాశి**
స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడతాయి. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. సన్నిహితుల మీ మాటతో విబేదిస్తారు. ఉద్యోగాలలో ఊహించని మార్పులు చోటుచేసుకుంటాయి. కొన్ని రంగాల వారికి సమస్యలు తప్పవు. రామనామ స్మరణ శుభకరం

**మకరరాశి**
చేపట్టిన పనులలో కష్టానికి తగ్గ ఫలితం కనిపించదు. బంధు మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేస్తారు. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. నిరుద్యోగుల యత్నాలు నిరాశ కలిగిస్తాయి. కాలభైరవ నామస్మరణ శుభకరం

**కుంభరాశి**
భూవివాదాల పరిష్కారమౌతాయి. వ్యాపారమునకు నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో నూతనోత్సాహంకాలు అందుతాయి. కుటుంబంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. చిన్ననాటి మిత్రులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. శనీశ్వరుని స్మరణ శుభకరం

**మీనరాశి**
చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఉంటాయి. వృథా ఖర్చులు పెరుగుతాయి. ఇంటా బయట బాధ్యతలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. విద్యార్థుల విదేశీ యత్నాలు మందగిస్తాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. వ్యాపారమున భాగస్థులతో వివాదాలు కలుగుతాయి. ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. సూర్య నామస్మరణ శుభకరం


శ్రీశ్రీశ్రీ కాలభైరవ ఉపవాసకులు
డక్క జంబులయ్య స్వామి

## సూదిని రాంరెడ్డి సన్మాన సభను విజయవంతం చేద్దాం

**- టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్**

**ఆమనగల్లు, మే 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ పంచాయితీ ట్రిబ్యునల్ చైర్మన్ గా ఇటీవల నియమితులైన సూదిని రాంరెడ్డిని అభినందన సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్లో కల్వకుర్తి నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ఈయుఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సూదిని రాంరెడ్డి అభినందన సన్మాన కార్యక్రమం గురించి సమావేశంలో చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలు అందరికీ సముచిత స్థానం కల్పిస్తున్నట్లు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డికి పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ గా నియమించడం అభినందనీయమని అన్నారు. చైర్మన్ పదవితో కల్వకుర్తి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని శ్రీనివాస్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. సూదిని రాంరెడ్డి అభినందన సన్మాన కార్యక్రమం ఈనెల 20వ తేదీన బుధవారం ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని 7 మండలాలు, 2 మున్సిపాలిటీల పరిధిలోని ప్రజలు, కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు రాజకీయాలకతీతంగా హాజరై సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, మాడుగుల, ఆమనగల్లు, కడ్తాల్ మండలాల అధ్యక్షులు భట్టు కిషన్ రెడ్డి, తెల్గమల్ల జగన్, బీచ్య నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, అంజయ్య గుప్తా మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, సర్పంచ్ నరేందర్ రెడ్డి, నాయకులు సుద్దపల్లి వెంకటేష్, పర్వతాలు, సూదిని శ్రీనివాస్ రెడ్డి, సూదిని కొండల్ రెడ్డి, కృష్ణ నాయక్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, హీరా సింగ్, జవహర్ లాల్, కాలే మల్లయ్య, అవ్వారి శివలింగం, ఎంగలి ప్రసాద్, కొండల్ రెడ్డి, అన్మాస్ పల్లి శంకర్, ఖాదర్ ఖాద్రి, శ్రీధర్ రెడ్డి, పూసల సత్యం, గోల్డ్ రాము, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, రాజేందర్, దేవరశెట్టి మహేష్, శేఖర్ గౌడ్, కుమార్ గౌడ్, శివ, రాజు, తులసీ రామ్, రహీం తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**దోమ మండలం మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎస్ జి గార్డెన్ లో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బోధించిన గురువులను సన్మానించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించిన విద్యార్థులను చూసి గురువులు ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రమోద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, మల్లయ్య, శ్రీనివాస్ గౌడ్, భ్రమరాంభిక, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు



**పెద్దపల్లి, మే 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మంచి ఫలితాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. జిల్లాలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులను సన్మానించి, వారికి నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 550కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఉన్నారని, ఉపాధ్యాయులు, హెడ్‌మాస్టర్లు చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు.గత రెండు సంవత్సరాలుగా పాఠశాలల్లో ఆధునీకరణ పనులు పూర్తి చేసి, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశామని తెలిపారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థుల ఫోటోలతో ప్రతి హైస్కూల్ పరిధిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.పిల్లలు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే విజయరమణరావు స్పష్టం చేశారు.

## చిన్నారుల ప్రాణాలకు ముప్పుగా మారిన ట్రాన్స్‌ఫార్మర్



**గన్నేరువరం, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గుణుకుల కొండాపూర్ గ్రామంలోని ప్రధాన రహదారి మూల మలుపు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చిన్నారుల చేతికి అందే ఎత్తులో ఉండటంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రమాదం జరిగాక స్పందిస్తారా అంటూ ప్రశ్నించారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రదేశానికి మార్చాలని వారు డిమాండ్ చేశారు.చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆపి, ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షితంగా మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## విద్యా వారోత్సవాల్లో క్రీడలు, ఆటలు



**కరీంనగర్, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో బోధన, బోధనేతర సిబ్బందికి క్రీడలు, ఆటలు నిర్వహించారు.రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. సతీష్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ క్రీడలు ఆటలు ప్రజల మనసులను ఉత్తేజపరుస్తాయని, వృత్తిపరమైన పనులపై మరింత దృష్టి పెట్టేలా చేస్తాయని అన్నారు.కార్యక్రమంలో కోఆర్డినేటర్ డా. ఎస్. రామకాంత్, సీఓఈ డా. డి. సురేష్ కుమార్, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా. నజీముద్దీన్ మున్వర్, ఫ్యాకల్టీ సభ్యులు డా. రవికుమార్, డా. రమేష్ రెడ్డి, నరసింహ చారి, డా. లక్ష్మీనారాయణ, పి.డి. విజయకుమార్, బోధనేతర సిబ్బంది చంద్రశేఖర్ రెడ్డి, ఫసియుద్దీన్, సాజిద్, గంగా చారి, సంధ్య, రాజిత, రాజేశ్వరి, స్వప్న, కాంతారావు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.విద్యా వారోత్సవాల్లో క్రీడలు, ఆటలు సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపాయి.

### ఘనంగా ప్రారంభమైన మినీ
## జీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్



**గంగాధర, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల కేంద్రంలో గంగాధర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినీ జీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ కొంతం దిలీప్ కుమార్, మధురానగర్ వార్డ్ సభ్యుడు గొంటి సంజీవ్, బిఆర్ఎస్ యువ నాయకుడు ఠాగూర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ టోర్నమెంట్‌లో 7 జట్లు పోటీపడుతున్నాయి. రానున్న 10 రోజులు మ్యాచ్‌లు కొనసాగుతాయి. గంగాధర మండలంలోని దాదాపు 250 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.ఫ్రాంచైజీ ఓనర్స్, క్రీడాకారులు, ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరై టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు. గంగాధరలో మినీ జీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది.

## చెరువు నిండితే... గ్రామ జీవితం పండుతుంది





**నంద్యాల, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
డోన్ మండలంలోని దేవరబండ చెరువు పూడికతీత పనులు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రారంభమయ్యాయి. గత ఐదేళ్లుగా కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో చెరువు నిండక రైతులు సాగునీటి కొరతను ఎదుర్కొన్నారు.రూ.5.83 లక్షల నిధులతో ప్రతిరోజూ 180--200 మంది కూలీలు ఎర్రవంక, వీధులవంక కాలువల్లో పూడికతీత చేస్తున్నారు. పనులు పూర్తయితే చెరువు మళ్లీ నిండుతుందని, బోర్లలో నీరు పెరిగి పంటలు పండుతాయని రైతులు ఆనందంగా చెబుతున్నారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, "చెరువులు పునరుద్ధరణ అంటే కేవలం పూడికతీత కాదు... రైతుల భవిష్యత్తుకు భరోసా కల్పించడం. ఈ పనులు పూర్తయితే నాలుగు గ్రామాల సాగునీటి సమస్య తగ్గుతుంది" అన్నారు.గ్రామస్తుల మాటల్లో ఇప్పుడు ఆశల వెలుగు కనిపిస్తోంది. "చెరువు బతికితే గ్రామం బతుకుతుంది" అనే నమ్మకానికి ఇది నిలువెత్తు నిదర్శనం.

## ధరలకు హద్దు లేదు- సీపీఎం




**నందికొట్కూరు, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెట్రోల్, డీజిల్ ధరలకు హద్దు లేకుండా పెంచుతూ ప్రజలపై భారాన్ని మోపుతున్నారని జూవీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. నాగేశ్వరరావు మండిపడ్డారు.ఆదివారం మార్కెట్ యార్డ్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో తాళ్లు కట్టి లాగుతూ నిరసన చేపట్టారు. "మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల తర్వాత మరో మాట చెబుతూ ప్రజలను మోసం చేస్తోంది. పెట్రోల్ లీటరుకు రూ.3 పెంపుతో రాష్ట్ర ప్రజలపై సంవత్సరానికి రూ.1200 కోట్లు, డీజిల్‌పై రూ.2190 కోట్లు అదనపు భారం పడుతోంది" అని ఆయన విమర్శించారు.గ్యాస్ ధరలు, విద్యుత్ చార్జీలు ఇప్పటికే పెంచిన పరిస్థితుల్లో మళ్లీ ఇంధన ధరలు పెరగడం వల్ల నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతాయని, రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొంగర వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, మార్కెట్ యార్డ్ హమాలీలు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్



**నందికొట్కూరు, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సూచనలతో ముచ్చుమర్రి ఎస్సై నరేంద్ర ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.నెహ్రూనగర్ గ్రామంలోని పాడుబడిన భవనంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.14,250 నగదు, 52 ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం



**ఆమనగల్లు, మే 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో నేడు (సోమవారం) ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ విజన్ సెంటర్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పిఆర్ఓ ఎంఏ పాష అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాషా కోరారు. కంటిచూపు మందగించిన వారు తమ గుర్తింపు కార్డులైన ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నెంబర్ తమ వెంట తెచ్చుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# రైతుల అభివృద్ధికి బాధ్యతగా పని చేస్తా

**- సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్**



**ఆమనగల్లు, మే 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రైతుల అభివృద్ధికి బాధ్యతగా పని చేస్తానని సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా పేర్కొన్నారు. ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గా ఇటీవల రెండోసారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కడ్తాల్ మండల రావిచెడు గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ అధ్వర్యంలో ఆదివారం గ్రామ కమిటీ సభ్యులతో కలిసి గంప వెంకటేష్ ను పూలమాల శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగల్ విండోల ద్వారా రైతన్నలకు పనిముట్లు, సబ్సిడీ రుణాలు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతిగా వ్యవహరించి దేశంలో ఎక్కడలేని రైతుబంధు, భీమా లాంటి అనేక పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగల్ విండో వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు కృషి చేసిందని హైకోర్టు ఆదేశాల మేరకు మళ్లీ న్యాయమే గెలిచిందని రైతుల పక్షాన సింగల్ విండో వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రైతన్నలు ఎన్నిక ద్వారానే పాలకవర్గాన్ని ఎన్నుకునేటట్టు తీర్పు ఇవ్వడంతో పాటు పాలకవర్గాన్ని కొనసాగించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. వెంకటేష్ గుప్తాను సన్మానించిన వారిలో ఉప సర్పంచ్ బందరీ యాదయ్య, పార్టీ సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్ గుప్తా, వార్డు సభ్యులు రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్, నాయకులు బాలకృష్ణ, లింగం, జితేందర్, బిక్షపతి, పవన్ కుమార్, రమేష్, రవి, బాల్ రాజ్, రవికుమార్, రాములు, రాఘవులు, శేఖర్, శశికాంత్, రమేష్ గౌడ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలపై అవగాహన సదస్సు




**పెద్దపల్లి /బెజ్జంకి/ పాలకుర్తి మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని పోలీసులు పిలుపునిస్తున్నారు. బెజ్జంకి మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో విలేజ్ పోలీస్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో దొంగతనాల నివారణ కోసం పోలీస్ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు, యువత, గ్రామ ప్రజలు పాల్గొని అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. యువత రాత్రి పహారా బృందాలుగా ఏర్పడి పోలీసులతో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. అదే విధంగా పాలకుర్తి మండలం జీడీ నగర్ గ్రామంలో సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని, యువత చెడు అలవాట్లకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు అప్రమత్తంగా గమనించాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో మొబైల్ ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని, ఆన్‌లైన్ లావాదేవీల్లో జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం కీలకమని అధికారులు స్పష్టం చేశారు.

### మానవత్వం చాటిన
## లెంకలపల్లి క్రికెట్ టీం



**మర్రిగూడ, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లెంకలపల్లి గ్రామంలో ఈఎల్వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ద్వితీయ బహుమతి పొందిన రూ.25,116ను గ్రామపంచాయతీ సిబ్బంది గుండెపూరి నరసింహ భార్య లక్ష్మి ఆరోగ్య చికిత్స కోసం అందజేశారు.ఆదివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజర్లు అయితగోని నరసింహ, చాపల శ్రీకాంత్, పగిళ్ల అశోక్, పాక కిరణ్, మానుపాటి సతీష్, కొలుగూరి వెంకటేష్, అయితగోని భిక్షం, తిపర్తి శ్రీరాములు, రేణుకుంట్ల నరేందర్ పాల్గొన్నారు.గ్రామస్థులు మాట్లాడుతూ, "మా లెంకలపల్లి గ్రామం తరపున భాస్కర్ కి ప్రత్యేక ధన్యవాదములు" అని తెలిపారు.

## సూదిని రాంరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన అంజన్ రెడ్డి



**ఆమనగల్లు, మే 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ గా సూదిని రాంరెడ్డి ఇటీవలే నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఆమనగల్లు మండలం పోలేపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ దారెడ్డి అంజన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూలబొకే అందజేశారు. ఆయన వెంట సాయి రెడ్డి, భగవాన్ రెడ్డి, కృష్ణ రెడ్డి, కొండల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన ' గోలీ శ్రీనివాస్ రెడ్డి '



**ఆమనగల్లు, మే 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మాడుగుల మండలం నాగిళ్ల గ్రామానికి చెందిన బరిగేల రాములు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆదివారం రాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి సహకారంతో 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాగిళ్ల గ్రామ సర్పంచ్ పాలకూర్ల సంతోష రాజు గౌడ్, గ్రామ అధ్యక్షులు సురమల్ల చెన్నయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సురమల్ల సత్తయ్య, పాలకూర వెంకటయ్య, వార్డు సభ్యులు తిరగమల్ల లక్ష్మయ్య, వడ్డమోని శేఖర్, పెరమండ్ల లింగం, పులికంటి మైసయ్య, పులికంటి కృష్ణ, కలకొండ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత హక్కుల రక్షణకు ఆర్‌పిఐ పిలుపు

**హుస్నాబాద్, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ఆర్‌పిఐ (అ) పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఇంచార్జి కొంపల్లి ప్రభుదాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా దళిత బహుజనుల హక్కుల కోసం పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. వివిధ పార్టీల నుంచి నాయకులు ఆర్‌పిఐలో చేరుతున్నారని, వారికి బాధ్యతలు అప్పగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.సమావేశంలో సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా ఆరె కిశోర్, కో-కన్వీనర్లుగా వేల్పుల మహేష్ బాబు, మంద వంశీ, హుస్నాబాద్ మండల




కన్వీనర్‌గా సుంకె రమేష్, భీమదేవరపల్లి మండల కన్వీనర్‌గా దేగల మహేందర్‌ను ఎన్నుకున్నారు.ఆరె కిశోర్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని, జాతీయ అధ్యక్షుడు రామ్‌దాస్ అథవాలే ఆలోచనలకు అనుగుణంగా దళిత బహుజనులను ఏకం చేసి సామాజిక న్యాయం సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పొలిటికల్ కీస్ ఈజ్ మాస్టర్ కీ సిద్ధాంతాన్ని అనుసరిస్తూ దళిత సాధికారత కోసం పోరాడుతామని పేర్కొన్నారు.దళితుల హక్కుల రక్షణకు, సామాజిక న్యాయం సాధనకు ఆర్‌పిఐ (అ) ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు సంకల్పించారు.

# వరస దొంగతనాలకు పాల్పడిన దొంగ అరెస్టు




**కొండమల్లేపల్లి, మే 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తాళం వేసిన ఇళ్లలో వరస దొంగతనాలకు పాల్పడుతున్న దాసరి విజయ్ అలియాస్ మాస్ విజయ్ (36)ను కొండమల్లేపల్లి పోలీసులు అరెస్టు చేశారు.నిందితుడు గత ఎనిమిది నెలల్లో ఎనిమిది దొంగతనాలు (కొండమల్లేపల్లి--4, దేవరకొండ--1, చింతపల్లి--1, కల్వకుర్తి--2) చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి 8 తులాల బంగారు ఆభరణాలు, రూ.90,000 నగదు, ఒక ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.ఫిర్యాదుదారుడు కర్రే ఆనంద్ (52) ఇంట్లో రూ.75,000 నగదు దొంగిలించబడినట్లు కేసు నమోదు కాగా, పెళ్లిపాకల ఎక్స్‌రోడ్ వద్ద వాహన తనిఖీల్లో నిందితుడు పట్టుబడ్డాడు.ఈ కేసును తక్కువ సమయంలో చేదించిన ఎస్సై ఏ. రమేష్, క్రైమ్ సిబ్బంది వి. హేము నాయక్, జి. భాస్కర్, కృష్ణారెడ్డి, పీసీ నవీన్ కుమార్, రైటర్ శేఖర్ రెడ్డిలను సీఐ ఏ. నవీన్ కుమార్ ఆధ్వర్యంలో డీఎస్పీ దేవరకొండ, ఎస్పీ నల్లగొండ అభినందించి నగదు రివార్డు అందజేశారు.

# షాద్‌నగర్‌లో ఘోరం

## - మేస్త్రి జయరాం పై కత్తుల దాడి

**షాద్‌నగర్, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మేస్త్రి జయరాంపై కత్తులతో దాడి చేసి గొంతు కోసి పరారయ్యారు.తీవ్ర గాయాలతో కుప్పకూలిన జయరాంను స్థానికులు, పోలీసులు కలిసి షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతరం ఉస్మానియా ఆసుపత్రికి రిఫర్ చేశారు.చౌదర్‌గూడ మండలం పెద్ద ఎలికిచర్ల గ్రామానికి చెందిన జయరాం గత కొన్నేళ్లుగా షాద్‌నగర్‌లో నివాసముంటూ మేస్త్రి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శివరాం నాయక్ ఆసుపత్రి సమీపంలో ఉన్న సమయంలో దుండగులు విచక్షణారహితంగా దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి, పాత కక్షలా, వ్యక్తిగత విభేదాలా లేక మరేదైనా కారణమా అన్న కోణాల్లో విచారణ ప్రారంభించారు. పట్టణంలో నడిబొడ్డున జరిగిన ఈ ఘటన స్థానికుల్లో భయాందోళన కలిగించింది.స్థానికులు దుండగులను త్వరగా పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేస్తున్నారు.

# ఫార్మసిటీ పేరుతో రైతుల భూముల స్వాధీనం ఆపాలి

## - సీపీఐ(ఎం)



**వెల్దండ, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫార్మసిటీ పేరుతో రైతుల భూములను పూర్తి పరిహారం చెల్లించకుండా స్వాధీనం చేసుకోవడం తీవ్ర అన్యాయమని సీపీఐ(ఎం) పార్టీ నాయకులు మండిపడ్డారు.జిల్లా హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని, జీవనాధారమైన భూములను బలవంతంగా లాక్కోవడం తగదని వారు స్పష్టం చేశారు.“రైతుల హక్కులను కాలరాస్తూ భూములు స్వాధీనం చేసుకోవడం ఆపాలి. రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ(ఎం) పార్టీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుంది” అని కుర్మిద్ద గ్రామ కార్యదర్శి మడ్డి సురేష్ తెలిపారు.

# విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం




**వంగూరు, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ పురుగుల యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ్స్ ఇందిర పిల్లల ఆసుపత్రి కల్వకుర్తి ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది.గ్రామం మరియు పరిసర ప్రాంతాల ప్రజలు తమ పిల్లల అనారోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సుమారు 150 మంది పిల్లలకు ఉచిత పరీక్షలు, మందులు అందించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎల్. అర్జున్ చౌహాన్, డాక్టర్ బి. గోపాల్కృష్ణ, మేనేజ్మెంట్ భాస్కర్ రెడ్డి, సిబ్బంది, గ్రామ ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మెడికల్ షాపుల సమస్యలు పరిష్కరించాలి

## - కమటాల రామ్మోహన్



బందు కరపత్రాలతో మెడికల్ ఏజెన్సీస్ మరియు మెడికల్ షాపుల యజమానులు

**కరీంనగర్, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మెడికల్ షాపుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కమటాల రామ్మోహన్ డిమాండ్ చేశారు.ఆన్‌లైన్ మందుల అమ్మకాలు నియంత్రణ లేకుండా సాగుతున్నాయని, భారీ డిస్కౌంట్ల పేరిట చిన్న మెడికల్ షాపులు నష్టపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ, నాసిరకం మందుల విక్రయాలను అరికట్టాలని, డాక్టర్ చీటీ దుర్వినియోగాన్ని ఆపాలని కోరారు.“ఈ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తాం. ఈనెల 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్ నిర్వహిస్తాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని షాపులు సహకరించాలి” అని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుండా మునిందర్ (రాజు), కోశాధికారి కొంజర్ల మహేష్, పలు మెడికల్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

# వెల్జాల్ ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభావంతులకు సన్మానం




**తలకొండపల్లి, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా వెల్జాల్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 10వ తరగతిలో 500 పైన మార్కులు సాధించిన 6 మంది విద్యార్థులు ఘనంగా సన్మానించబడ్డారు.టాపర్‌గా నిలిచిన ఎం. లక్ష్మీ ప్రణతి (539 మార్కులు)కు శాలువా, మెమెంటోతో పాటు రూ.3000 నగదు అందజేశారు. ప్రసన్న (533), భార్గవి (518), వినయ్ (508), శృతి (507), సోహాన బేగం (507)లిలకు ఒక్కొక్కరికి రూ.1000 నగదు, శాలువా, మెమెంటోలు అందజేశారు.పాఠశాలలో 100% ఉత్తీర్ణత సాధించడంతో ప్రధానోపాధ్యాయురాలు నసీమా సుల్తానాను కూడా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ అంజయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీలు, ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎస్సీ సెల్ చైర్మన్ పదవికి దరఖాస్తు స్వీకరణ



**అచ్చంపేట, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగం నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పదవికి అర్హులు, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశీలకులు తెలిపారు.ఆదివారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను కలిసిన దళితరత్న దుబేట రమేష్, అర్షం అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అచ్చంపేట తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్ కూడా దరఖాస్తు చేసుకున్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే గిత్త



**నందికొట్కూరు, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరులో సయ్యద్ బాష కుమారుని వివాహ శుభకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరమ్ ప్రసాద్ రెడ్డి, సొసైటీ చైర్మన్ సర్వోత్తమ్ రెడ్డి, ఖాజా మొహిద్దిన్, లాడెన్ తదితరులు పాల్గొన్నారు.

# చదువే సర్వస్వం

-చదువంటే
ఒక ఆట కాదు
జ్ఞానమార్గాన్ని చూపించే బాట
-చదువంటే
అగమ్యం కాదు
నీ జీవిత గమ్యం
-చదువంటే
చవక కాదు
భవసాగరాన్ని దాటించే నౌక
-చదువంటే
గుదిబండ కాదు
నిత్యం నీతో ఉండే అండ దండ
-చదువంటే
ఒక అంశం కాదు
సమస్త విషయాల సారాంశం
-చదువంటే
ఒక వృథ కాదు
సకల శాస్త్రాల కథ
-చదువంటే
కాలయాపన కాదు
విజ్ఞాన విషయాల గానాలాపన
-చదువంటే
విరక్తి కాదు
విలువైన ఆసక్తి
-చదువును చేయకు నిర్లక్ష్యం
చేస్తే......
చేరుకోలేవు నీ లక్ష్యం

చదువంటే...
సంస్కారం, సత్కారం
సాక్షాత్తు
సరస్వతిదేవి సాక్షాత్కారం



Ch.శ్రీనివాస్
ఉపాధ్యాయుడు
ZPHS కనుకుల
స్వగ్రామం.. ఎలిగేడు

( చదువును నిర్లక్ష్యం చేసే వారికి
చదువు విలువను
తెలియజేయాలనే చిన్న ప్రయత

# వాసవి భవనంలో ఉచిత వైద్య శిబిరం



**నందికొట్కూరు, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు పట్టణంలోని వాసవి భవనంలో అవోపా, సుశ్రుత ఫౌండేషన్, ఏసియన్ వాస్కులర్ హాస్పిటల్స్ హైదరాబాద్ సంయుక్త సౌజన్యంతో ఉచిత వెరికోస్ వీన్స్ వైద్య శిబిరం నిర్వహించారు.డాక్టర్ సోమాచారి, కె. ఉమా సిస్టర్, హాస్పిటల్ రెసిడెంట్‌లు, జోనల్ ఇన్‌చార్జ్ సురేందర్ ఆధ్వర్యంలో సుమారు 140 మంది పేషెంట్లకు పరీక్షలు, అందులో 40 మందికి వ్యాధి నిర్ధారణ చేసి, వారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి లేజర్ చికిత్స ఉచితంగా అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు వీరబొమ్మ నాగ సత్యనారాయణ ప్రారంభించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భీమీశెట్టి జయరామకృష్ణ, అవోపా అధ్యక్షుడు కల్కి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్





**నంద్యాల, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తమ పరిధిలోని రౌడీషీటర్లు, నేరచరిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.వారిని సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం వారు చేస్తున్న వృత్తులు, జీవనోపాధి గురించి ఆరా తీశారు.“మీపై నిరంతరం నిఘా ఉంటుంది. పోలీసుల మాటలను వినకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా కఠిన చర్యలు తీసుకుంటాం” అని అధికారులు హెచ్చరించారు.

## దివ్యాంగుడికి స్కూటీ అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ



**గన్నేరువరం మే 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తిమ్మాపూర్ మండలం ఎల్.ఎం.డి కాలనీలోని ప్రజా భవన్‌లో ఆదివారం గుండ్లపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు సతీష్ రెడ్డికి ప్రభుత్వం తరపున స్కూటీని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్కు ఉపేందర్ రెడ్డి, ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్ రెడ్డి, అంజిరెడ్డి, ఎర్రోళ్ల రాజయ్య, ఎల్లారెడ్డి, చింతలపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**కరీంనగర్, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ కంది కృష్ణారెడ్డి 63వ జయంతి సందర్భంగా వావిలాలపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీ సప్తగిరి, సాయికృష్ణ ఎలక్ట్రికల్ వైండింగ్ వర్క్స్ ఆధ్వర్యంలో, శివ ఎలైట్ కిడ్నీ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్లు పి. శివకుమార్, పి. నిరోషా రోగులను పరీక్షించి రక్త నమూనాలు, బీపీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రినిటీ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రమణారెడ్డి, మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సురేష్, 51వ డివిజన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ వంగ వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్లభూత్కూర్ గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ నాయిని మల్లేశం పక్షవాతంతో బాధపడుతుండగా, కంది కృష్ణారెడ్డి కుమారులు వెంకట్ రాంరెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఉచిత వైద్య శిబిరం ప్రజల్లో విశేష స్పందన రాబట్టగా, ఆర్థిక సహాయం ద్వారా మానవత్వాన్ని చాటారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వైభవంగా ముగిసిన విద్యా వారోత్సవాలు




**కరీంనగర్ మే 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వారాంత విద్యా వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. వారం రోజుల పాటు విద్యా, సాంస్కృతిక, సామాజిక అవగాహన కార్యక్రమాలతో కళాశాల ప్రాంగణం ఉత్సాహభరిత వాతావరణంతో కళకళలాడింది. వాలెడిక్టరీ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులు, కళాశాల అభివృద్ధికి విశేష సేవలు అందించిన అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ డి. వరలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, సమాజ సేవ పట్ల బాధ్యతాభావం పెంపొందాలని సూచించారు. మహిళా విద్య సమాజాభివృద్ధికి మూలస్తంభమని, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని ప్రేరణనిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, గేయాలు, నాటికలు సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభ, క్రమశిక్షణ, ఉత్సాహం కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి. విద్యా, సాంస్కృతిక, సామాజిక చైతన్య కార్యక్రమాల సమ్మేళనంగా నిర్వహించిన ఈ వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి.

## దరఖాస్తుల స్వీకరణ..

**మందమర్రి మే 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మందమర్రి పట్టణ కాంగ్రెస్ మరియు అనుబంధ సంఘాల వార్డు అధ్యక్షుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మందమర్రి పట్టణంలోని బి-1 క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మంద తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొతుకు సుదర్శన్,పట్టణ ఇన్‌ఛార్జ్ గోపతి భానేష్, దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు దరఖాస్తుల స్వీకరణ చేపట్టినట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారంతో ముగిసిందని, ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరోసారి దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆశావహులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# పేదల ముంగిట సంక్షేమ పథకాలు



**మానకొండూర్ మే 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానకొండూరు ఎమ్మెల్యే, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ఇంటింటా ప్రచారం చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందని. ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షుడు ద్యావ శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెంచాల కిషన్ రావుల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హయాంలో ధనికులకు మాత్రమే మేలు జరిగిందని, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో పేదలు, మధ్యతరగతి వారికి లబ్ధి చేకూరుతోందని చెప్పారు. ఆరు గ్యారెంటీ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని, త్వరలో కొత్త పెన్షన్లు ఇవ్వనున్నామని తెలిపారు. నందగిరి రవీంద్ర చారి కృషి వల్లే మండలంలో కాంగ్రెస్ బలమైన శక్తిగా ఎదిగిందని, కార్యకర్తల కష్టంతోనే పార్టీ అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. రవీంద్ర చారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని, నూతన అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి కూడా సహకారం అందించాలని కోరారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. నందగిరి మాట్లాడుతూ మండలంలో 16 మంది సర్పంచులను గెలిపించుకోవడం కార్యకర్తల సమిష్టి కృషి వల్లే సాధ్యమైందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని సాధించాలని కోరారు. సమావేశంలో పెంచాల కిషన్ రావు, మర్రి ఓదెలు యాదవ్, తిరుమల్ రెడ్డి, తాళ్లపల్లి సంపత్ గౌడ్, ముద్దసాని శ్రీనివాసరెడ్డి, మోరపల్లి రమణారెడ్డి, ముస్కు ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శిగా అడిచెర్ల రాజు నియామకం



**కరీంనగర్ మే 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శిగా కరీంనగర్ జిల్లా నాయకుడు అడిచెర్ల రాజు నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి తెలంగాణ రాష్ట్ర పార్టీ ఉత్తర్వులు విడుదల చేసింది. రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ, ఓబీసీ మోర్చా బలోపేతం కోసం శాయశక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలు, మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా విద్యా విజయోత్సవం



**కరీంనగర్, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. విద్యా విజయోత్సవం -- అభ్యాసంలో శ్రేష్ఠతను జరుపుకోవడం అనే నినాదంతో జరిగిన ఈ ముగింపు కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను వేదికపై ఘనంగా సన్మానించారు. వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ విజయోత్సవంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ విభాగాల ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులు, ఉపాధ్యాయుల సత్కారంతో విద్యా విజయోత్సవం ఘనంగా ముగిసింది.

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యం - రైతుల ఆవేదన



**పాలకుర్తి, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బసంతనగర్, పాలకుర్తి, ఈశాల తక్కల్లపల్లి, రామారావుపల్లి, పుట్నూరు, కుక్కలగూడూరు గ్రామాల్లో రైతులు 20 రోజులకు పైగా కంటికి కునుకు లేకుండా ధాన్యం కుప్పల వద్దే కాపలా కాస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుల్తానాబాద్ మిల్లులకు తరలించిన లారీలు తిరిగి రాకపోవడంతో తూకం ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పటికే తూకం వేసిన ధాన్యం ఎండలకు బరువు తగ్గి మిల్లులో కోత విధిస్తే ఆర్థిక నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎర్రటి ఎండలు, అకాల వర్షాల భయం మధ్య రైతులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. రోహిణి కార్తె ప్రారంభం కావడంతో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు నాయకులు, అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



**కరీంనగర్, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ తిరుపతి గౌడ మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి గౌడ బిడ్డ ఆయురారోగ్యాలతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. బోనాల ద్వారా గ్రామ గౌడ సభ్యులు ఐక్యతను చాటారని, ఇదే ఐక్యతతో పేద విద్యార్థులకు సహాయం చేయాలని, నిరుపేద గౌడ కులస్తులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గౌడ కులస్తులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేయాలని ఆయన సూచించారు. బైండ్ల పూజారులు, డప్పు చప్పుళ్లతో పాటలతో పోచమ్మ బోనాలు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో ఆరవ డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేష్, తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ గౌడ, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గోపాగోని నవీన్ గౌడ, కరీంనగర్ మండల అధ్యక్షుడు బుస శ్రీనివాస్ గౌడ, గౌడ సంఘ నాయకులు అంజయ్య గౌడ, కత్తి మధు గౌడతో పాటు గౌడ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. డప్పు చప్పుళ్ల మధ్య పోచమ్మ బోనాలు గ్రామంలో భక్తి, ఐక్యత వాతావరణాన్ని నెలకొల్పాయి.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**కరీంనగర్ , మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గోపాల్పూర్ గ్రామ శివారులో తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. బెజ్జంకి సాయికుమార్ (25) తన బంధువు యశ్వంత్‌తో కలిసి కెటిఎం మోటార్‌సైకిల్‌పై కరీంనగర్ నుండి గోపాల్పూర్ వెళ్తుండగా క్రీడా ప్రాంగణం వద్ద రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిపోయారు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, సాయికుమార్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. యశ్వంత్‌ను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. సాయికుమార్ కొంతకాలంగా కరీంనగర్‌లోని వన్ హాస్పిటల్‌లో ఉద్యోగం చేస్తూ, మార్బుల్ వర్క్స్‌లో కూడా పనిచేస్తున్నాడు. అతనికి తల్లి, ఇద్దరు సోదరులు ఉన్నారు. వివాహం కాలేదు. గ్రామంలో అందరితో సన్నిహితంగా ఉండే స్వభావం కలిగిన సాయికుమార్ మృతి గ్రామస్థులను కలచివేసింది. తల్లి బెజ్జంకి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శవపరీక్ష అనంతరం కుటుంబానికి అప్పగించారు. అతివేగం కారణంగా జరిగిన ఈ ప్రమాదం గ్రామంలో విషాదాన్ని మిగిల్చింది.

## మున్నూరు కాపుల
# ఐక్యత సమావేశం

- రాజ్యాధికార సాధనకు పిలుపు



**పెద్దపల్లి, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన మున్నూరు కాపుల ఐక్యత సమావేశంలో నాయకులు సముచిత రాజ్యాధికార సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక సాధికారత కోసం మున్నూరు కాపులు సంఘటితంగా ముందుకు సాగాలని వారు సూచించారు.మున్నూరు కాపులకు చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలని, నామినేటెడ్ పదవుల్లో తగిన వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మున్నూరు కాపుల జనాభాను తక్కువగా చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, వాస్తవ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.రాజ్యాధికారంలో భాగస్వామ్యం సాధించాలంటే ముందుగా ఆర్థికంగా బలోపేతం కావాలని, విద్యా మరియు ఉద్యోగ రంగాల్లో మరింత ముందుకు రావాలని నాయకులు సూచించారు. మున్నూరు కాపులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కూడా వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం ఇంచార్జ్ ఈసంపల్లి వెంకన్న పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మరియు మాజీ మున్సిపల్ చైర్మన్ ఎలువక రాజయ్య, యూత్ రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్, అమిరిశెట్టి రామాస్వామి, జడల సురేందర్ పటేల్, మల్కా రాజేశం, శ్రీధర్ పటేల్, ఆకుల కిరణ్ పటేల్, వెంకన్న పటేల్, కొత్త శ్రీనివాస్ తదితరులతో పాటు ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఐక్యతతోనే రాజ్యాధికార సాధ్యమని మున్నూరు కాపు నాయకులు స్పష్టం చేశారు.

## జర్నలిస్టుల సంక్షేమ సంఘంలో నూతన బాధ్యతలు




**పెద్దపల్లి, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెద్దపల్లి జిల్లా సీనియర్ జర్నలిస్టు, తెలుగు ప్రభ దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ బందెల రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగంటి రాజు ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.హన్మకొండ ఆదర్శ లా కాలేజీలో ఆదివారం జరిగిన రాష్ట్ర ప్రథమ సదస్సులో ఈ ప్రకటన జరిగింది. సదస్సుకు హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా, జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి హాజరయ్యారు. బందెల రాజశేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల రక్షణ, సంక్షేమం కోసం పోరాటం చేస్తానని చెప్పారు. జర్నలిస్టులను ఐక్యం చేసి సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.త్వరలోనే పెద్దపల్లి జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ సభ నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.జర్నలిస్టుల హక్కుల కోసం, సంక్షేమం కోసం పోరాటం కొనసాగిస్తానని బందెల రాజశేఖర్ స్పష్టం చేశారు.

## డిగ్రీ కళాశాలో ఘనంగా ముగిసిన విద్యా వారోత్సవాలు



**హయత్‌నగర్, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మే 11 నుండి 17 వరకు నిర్వహించిన విద్యా వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ప్రిన్సిపాల్ డా. పి. సురేష్ బాబు మాట్లాడుతూ తరగతి గది విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక సేవ, నైపుణ్య శిక్షణ, సాంస్కృతిక చైతన్యం విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో కీలకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఎన్‌సిసి క్యాడెట్స్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్స్, జాతీయ స్థాయి క్రీడాకారులు, సాంస్కృతిక ప్రదర్శనలలో పాల్గొన్న విద్యార్థులను బహుమతులతో సత్కరించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఇందిర, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. నరసింహ, ఐక్యుఏసి కోఆర్డినేటర్ డా. మధు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.విద్యా వారోత్సవాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, భవిష్యత్తు విజయాలకు పునాది వేశాయి.

# సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అమ్రాబాద్, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అమ్రాబాద్ మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రజాప్రభుత్వం ధ్యేయమని, గత పాలకుల నిర్లక్ష్యానికి భిన్నంగా తమ ప్రభుత్వం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తోందని తెలిపారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామని, రైతులు విక్రయించిన వెంటనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని వివరించారు.ఆరు నెలల్లోనే రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేసి 25 లక్షల మంది రైతులకు ఉపశమనం కల్పించామని గుర్తు చేశారు.





రైతు భరోసా పథకం ద్వారా రూ. 12 వేల సహాయం అందిస్తున్నామని, గోదాముల సామర్థ్యాన్ని 200 శాతం పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోల్డ్ స్టోరేజీలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించి త్వరలో అందుబాటులోకి తెస్తామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాలను అప్పుల భారమున్నప్పటికీ చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిగుర్ల కోటయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు ఎంఏ రహీం సర్దార్, మార్కెట్ వైస్ చైర్మన్ వెంకటయ్య, హరి నారాయణ గౌడ్, బాలింగం గౌడ్, వ్యాపారస్తులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పష్టం చేశారు.

## మధు కుటుంబాన్ని పరామర్శించిన టౌన్ అధ్యక్షుడు



**నందికొట్కూరు, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మారుతి నగర్ విద్యార్థి విభాగ అధ్యక్షుడు మధు కుటుంబాన్ని పట్టణ అధ్యక్షుడు మన్సూర్ అహమ్మద్, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి జబ్బ పరామర్శించారు.ఈ సందర్భంగా టౌన్ అధ్యక్షుడు మాట్లాడుతూ, “వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా, తోడుగా ఉంటాం” అని భరోసా ఇచ్చారు.అనంతరం రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కూడా మధు తండ్రి ఓపెన్ సర్జరీ జరిగిన విషయం తెలుసుకొని, మారుతి నగర్‌లోని మధు ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. “కార్యకర్తలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాం” అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏసన్న, చరణ్ తేజ, స్టూడెంట్ వింగ్ టౌన్ అధ్యక్షుడు శశాంక్, మైనారిటీ నాయకులు నిషార్, బాబు, రెహమాన్, అలాగే రమణ మధు, వంశీ, సలీం, రియాజ్, లాజర్, ప్రకాశం, విజయ్, మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.


## హీరో మంచు మనోజ్ జన్మదిన సందర్భంగా రక్తదానం ప్రాణదానం తో సమానం బండి రమేష్.



**కూకట్పల్లి మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హీరో మంచు మనోజ్ జన్మదిన సందర్భంగా టిడిపి నాయకులు షేక్ సత్తార్ , ఆర్ కే చౌదరిల ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ హౌసింగ్ బోర్డ్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్ యాదవ్ గారి తో కలిసి టీపీసీసీ ఉపాధ్యక్షులు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మంచుమనోజ్ సేవాభావం ఉన్న మంచి మనిషి అని మీ సేవలో భాగస్వామ్యం చేయడం ద్వారా సమాజానికి తన వంతు సేవ చేసినట్లు అవుతుందని కొనియాడారు.

## మే 24 నుండి 30 వరకు శ్రీమద్భాగవత్ కథా ప్రవచనం

**జహీరాబాద్, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
: జహీరాబాద్ పట్టణంలోని శ్రీ వాసవి కల్యాణ మంటపంలో ఈ నెల 24 నుండి 30 వరకు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల వరకు శ్రీమద్భాగవత్ కథా ప్రవచనం ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో



బృందావనం శ్రీదామం నుండి శ్రీ ఆశిష్ కృష్ణ శాస్త్రిజీ మహారాజ్ భగవత్ కథ ప్రవచనం జరుపుతారని వివరించారు. భగవత్ కథ ప్రారంభ రోజు మే 24 న 108 కలశాలతో స్థానిక హనుమాన్ మందిరం నుండి వాసవి కల్యాణ మంటపం వరకు భవ్య శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం లో పట్టణానికి చెందిన మహిళామణులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఇట్టి కథా శ్రవణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ కేసరి పోటీలు విజేతగా నిలిచిన అబూబకర్ బామస్



**హైదరాబాద్, మే 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహించే తెలంగాణ కేసరి కుస్తీ పోటీలు ఈసారి మే 7 నుంచి 10 వరకు ఎల్బీనగర్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. బాలాపూర్‌కు చెందిన ప్రముఖ రెజ్లర్, ఫిట్నెస్ ఫ్రేక్ జిమ్‌లో సాధన చేసే అబూబకర్ బామస్ 2026 తెలంగాణ కేసరి టైటిల్ కైవసం చేసుకొని విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా ఆయనకు రూ. 3 లక్షల నగదు బహుమతిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అందజేశారు. విజయాన్ని పురస్కరించుకొని ఆదివారం ఫిట్నెస్ ఫ్రేక్ జిమ్‌లో ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. జిమ్ యజమాని కాందాడ శ్రీశైలం రెడ్డి, కోచ్ వీరేష్, బడంగ్‌పేట్ సర్కిల్ ఛత్రపతి శివాజీ ఉత్సవ సమితి అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పూలమాలలతో అబూబకర్ బామస్‌ను సన్మానించారు.ఈ సందర్భంగా పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలవకుండా ప్రతిరోజు వ్యాయామం, క్రీడలు, నడక, యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేస్తే జాతీయ స్థాయిలో కూడా విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కోచ్ వీరేష్ సేవలను ప్రత్యేకంగా కొనియాడారు.కార్యక్రమంలో ఉదయ్, శుభం, సంజయ్, రబ్బాని, శశి, చరణ్, ప్రత్యుష్, రాంపాల్, వంశీ, శివ, రవి, డాక్టర్ ఉదయ్, ఫయాజ్, జుబేర్, ఉస్మాన్ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.అబూబకర్ బామస్ విజయం తెలంగాణ కుస్తీ రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

## ఆటో డ్రైవర్ సేవలకు అభినందనలు

**పెద్దపల్లి, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాల్వ శ్రీరాంపూర్ మండలంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ఆటో డ్రైవర్ సలీమ్ నిర్వహిస్తున్న



ఆటోమొబైల్ చలివేంద్రాన్ని గమనించి ప్రత్యేకంగా అభినందించారు.మండుతున్న ఎండల్లో ప్రయాణికులకు చల్లని తాగునీరు అందించడం గొప్ప సేవా కార్యక్రమమని ఆయన పేర్కొన్నారు. చిన్న స్థాయిలో అయినా సమాజానికి ఉపయోగపడే విధంగా ముందుకు వచ్చి చలివేంద్రం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజల దాహార్తిని తీర్చే ఈ సేవ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని, ఇలాంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, సర్పంచ్ సదాశివ్ రెడ్డి, జక్కే రవి, విష్ణువర్ధన్, కుంభం రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రజల కోసం ఆటో డ్రైవర్ సలీమ్ చేస్తున్న సేవను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ప్రశంసించారు.

## నూతన సీఐని సన్మానించిన ఎలిగేడు సర్పంచులు

**ఎలిగేడు, మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పున్నమనేని రంజిత్ రావును ఎలిగేడు మండల సర్పంచులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, బొకే అందజేసి సన్మానం చేశారు.కార్యక్రమంలో సర్పంచులు కప్పల ప్రవీణ్, ఏలేటి వెంకటరెడ్డి, మారం కొమురయ్య, పల్లెర్ల వెంకటేష్, దుగ్యాల గోపాలరావు, రంగు శ్రీనివాస్, మద్దెల సంపత్, సిద్ది తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




నూతన సీఐ ని కలిసిన ఎలిగేడు సర్పంచులు నాయకులు

# రష్యాపై భారీ డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి..

**భారతీయ కార్మికుడితో సహా నలుగురు మృతి**



**మాస్కో మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారీ సంఖ్యలోని డ్రోన్లతో రష్యాపై ఉక్రెయిన్ దాడి చేసింది. భారతీయ కార్మికుడితో సహా నలుగురు మరణించారు. మరో ముగ్గురు భారతీయ కార్మికులు, మరి కొందరు గాయపడ్డారు. రష్యాలోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని ధృవీకరించింది. దాడి జరిగిన ప్రదేశాన్ని అధికారులు సందర్శించారని, గాయపడిన కార్మికులను ఆసుపత్రిలో పరామర్శించినట్లు తెలిపింది. 'ప్రాణనష్టం పట్ల రాయబార కార్యాలయం సంతాపం వ్యక్తం చేస్తోంది. భారతీయ కార్మికులకు అవసరమైన సహాయం అందించడానికి కంపెనీ యాజమాన్యం, స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తోంది' అని భారత రాయబార కార్యాలయం ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది.కాగా, ఆదివారం తెల్లవారుజామున రష్యాపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు ఉక్రెయిన్ పాల్పడింది. రష్యా రాజధాని మాస్కోలోని కొన్ని ప్రాంతాలు, సమీప ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించాయి. 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 1,000కు పైగా ఉక్రెనియన్ డ్రోన్‌లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. మరోవైపు రాజధాని వైపు దూసుకొచ్చిన సుమారు 81 డ్రోన్‌లను వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు. ఈ దాడుల వల్ల పలు ప్రాంతాల్లోని నివాస భవనాలు, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. నలుగురు మరణించారని, వీరిలో ముగ్గురు మాస్కో ప్రాంతానికి చెందినవారని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ సరిహద్దు సమీపంలోని బెల్గోరోడ్ ప్రాంతంలో మరో మరణం నమోదైనట్లు వెల్లడించారు.

# పశ్చిమబెంగాల్‌లో బీజేపీ మార్క్ రాజకీయం..

**-బిశ్వ బంగ్లా లోగోల స్థానంలో అశోక చిహ్నం**



**న్యూఢిల్లీ మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పశ్చిమబెంగాల్ లోని బీజేపీ ప్రభుత్వం అధికారిక వేదికల నుంచి 'బిశ్వ బంగ్లా లోగోను తొలగించడం ప్రారంభించింది. మాజీ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ హయాంలో ప్రవేశపెట్టిన ఈ లోగో స్థానంలో భారత జాతీయ చిహ్నమైన అశోక చిహ్నాన్ని ఏర్పాటు చేస్తోంది. కోల్‌కతా లోని ప్రముఖ సాల్ట్ లేక్ స్టేడియం వద్ద బిశ్వ బంగ్లా బోర్డును తొలగించి అశోక చిహ్నాన్ని పెట్టారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో కూడా ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ప్రభుత్వ విభాగాలు, సేవలను అనుసంధానించే 'ఎగియే బంగ్లా' పోర్టల్‌లో కూడా అశోక చిహ్నాన్ని ఉంచారు. గతంలో ఉన్న తెలుపు, నీలం రంగుల థీమ్‌ను మార్చి కాషాయ రంగును చేర్చారు. బెంగాలీ అక్షరం 'బ' ఆధారంగా రూపొందించిన ఈ బ్రాండ్ 2013 సెప్టెంబర్ 16న ప్రారంభమైంది. బెంగాల్ సంస్కృతి, పర్యాటకం, హస్తకళలకు ప్రతీకగా తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని విస్తృతంగా వాడింది. ప్రస్తుతం అప్‌డేట్ చేసిన పోర్టల్‌లో అశోక చిహ్నంతోపాటు ముఖ్యమంత్రి సువేందు అధికారి ఫొటోను పెట్టారు. పర్యాటకం, పరిశ్రమలు, వ్యవసాయ శాఖల ఐకాన్‌లను కాషాయ రంగు గ్రాఫిక్స్‌తో రీడిజైన్ చేశారు. ఒక వ్యక్తి రూపొందించిన లోగో రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ముద్రగా ఉండకూడదంటూ బీజేపీ నేతలు ఈ నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు.

# తెలంగాణ రాష్ట్రంలోకి ఆలస్యంగా నైరుతి రుతుపవనాలు..!



**న్యూఢిల్లీ మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఈసారి తెలంగాణ లోకి నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశిస్తాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి రుతుపవనాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. గత ఏడాదితో పోలిస్తే రుతుపవనాల రాక 4 నుంచి 5 రోజులు ఆలస్యం కానుంది. ఈ నెల 26న కేరళ ను తాకనున్న రుతుపవనాలు, ఆ తర్వాత సాధారణంగా 4 నుంచి 7 రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశిస్తాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులు, బంగాళాఖాతం, అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాల్లో విస్తరించాయి. ఇవి మరింత ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపిందిఇదిలావుంటే రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం అదిలాబాద్‌లో అత్యధికంగా 44.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం జోగులాంబ గద్వాల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

# మోదీజీ.. నీట్ పేపర్ లీకేజీపై సమాధానం చెప్పండి.

**ప్రధానిని ప్రశ్నించిన రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నీట్ పేపర్ లీకేజీ విషయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధాని మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సూచించారు. ఎక్స్ వేదికగా ఆదివారం ఈ అంశంపై రాహుల్ మరోసారి స్పందించారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. మోదీ మౌనంగా ఉండటాన్ని ప్రశ్నించారు.గతంలో కూడా పేపర్ లీకైన తర్వాత కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని రాహుల్ ప్రశ్నించారు. "నీట్ 2024 : పేపర్ లీకైంది. పరీక్ష



రద్దైంది. మంత్రి మాత్రం రాజీనామా చేయలేదు. సీబీఐ విచారణ జరిగింది. ఒక కమిటీ ఏర్పడింది. నీట్ 2026 : పేపర్ లీకైంది. పరీక్ష రద్దైంది. మంత్రి ఇప్పటికీ రాజీనామా చేయలేదు. ఎప్పట్లాగే సీబీఐ విచారణ జరుపుతోంది. ఇంకో కమిటీ ఏర్పాటైంది. మోదీజీ.. దేశం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడుగుతోంది. వాటికి జవాబివ్వండి. వరుసగా పేపర్ లీకేజీలు ఎందుకు జరుగుతున్నాయి..? పరీక్షపై చర్చలో మీరు ఇంకా ఎందుకు మౌనంగా ఉన్నారు..? వరుసగా పేపర్ లీకవుతున్నా సంబంధిత విద్యాశాఖ మంత్రిని ఇంకా ఎందుకు తొలగించడం లేదు" అంటూ రాహుల్ ట్వీట్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలంటూ హ్యాష్?ట్యాగ్ పెట్టారు.రెండు రోజుల క్రితం కూడా నీట్ పేపర్ లీకేజీపై రాహుల్ స్పందిస్తూ.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని, లేదా దీనికి మోదీయే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాదికి సంబంధించి జరిగిన నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరుగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితుల్ని సీబీఐ అరెస్టు చేసింది.

# ఆ ఒప్పందం జరిగితేనే భారత్‌తో బంధం కొనసాగుతుంది

**న్యూఢిల్లీ మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భవిష్యత్తులో భారత్ తో సంబంధాలు కొనసాగడం గంగానది నీటి పంపకాల ఒప్పందంపైనే ఆధారపడి ఉంటుందని బంగ్లాదేశ్ అధికార పార్టీ కొత్త మెలిక పెట్టింది. ఈ మేరకు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త ఒప్పందం కోసం చర్చలు జరపాలని భారత్‌ను డిమాండ్ చేసింది. కాగా ప్రస్తుతం అమల్లో ఉన్న ఇండో-బంగ్లాదేశ్ గంగానది నీటి ఒప్పందం 1996లో జరిగింది. అప్పటి ప్రధాని షేక్ హసీనా హయాంలో కుదిరిన ఈ డీల్ ఈ ఏడాది డిసెంబర్‌తో ముగియనుంది. కొత్త ఒప్పందం కుదిరేవరకు పాత ఏర్పాట్లే కొనసాగాలని బంగ్లాదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి మీర్జా ఫక్రుల్ ఇస్లాం



ఆలంగీర్ పేర్కొన్నారు.భవిష్యత్తులో జరిగే నీటి ఒప్పందాలకు కాలపరిమితి ఉండవద్దని ఆలంగీర్ షరతు విధించారు. కాగా, గంగానదిని బంగ్లాదేశ్‌లో పద్మా నదిగా పిలుస్తారు. అక్కడి వ్యవసాయం, పర్యావరణం, తాగునీటి వ్యవస్థలకు ఈ నది ఎంతో కీలకం. బంగ్లాదేశ్‌లోని మూడో వంతు జనాభా జీవనోపాధి కోసం ఈ నదిపైనే ఆధారపడుతున్నారు. ఫరక్కా బ్యారేజ్ వల్ల తమకు ఎండాకాలంలో నీటి ప్రవాహం తగ్గిపోతోందని బంగ్లాదేశ్ అంటోంది. దీనివల్ల నదుల్లో ఉప్పునీరు చేరి పంటలు దెబ్బతింటున్నాయని వాదిస్తోంది. మరోవైపు కోల్‌కతా పోర్టు రక్షణ కోసమే ఫరక్కా బ్యారేజ్ నిర్మించినట్లు భారత్ మొదటి నుంచి చెబుతోంది.ఈ ఇబ్బందులను అధిగమించే పేరిట బంగ్లాదేశ్ పద్మా నదిపై ఒక మెగా బ్యారేజ్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఇది 2033 నాటికి పూర్తి చేయాలని ప్రధాని తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని కమిటీ నిర్ణయించింది. ఈ బ్యారేజ్ నిర్మాణంపై భారత్‌తో సంప్రదింపులు జరపాల్సిన అవసరం లేదని బంగ్లాదేశ్ ఏకపక్షంగా నిర్ణయించింది.

# కాంగో, ఉగాండాలో ఎబోలా కలకలం..

**-88 మంది మృతి..**
**-హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యూహెచ్‌వో**


**న్యూఢిల్లీ మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ప్రాణాంతక ఎబోలా వైరస్ తో ఆఫ్రికా ఖండంలోని రిపబ్లిక్ ఆఫ్ కాంగో లో 88 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 300 మంది ఈ వైరస్ బారిన పడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. దీనివల్ల ప్రపంచ దేశాలకు తక్షణ ముప్పు లేకపోయినా.. కాంగో పొరుగు దేశాల్లో వేగంగా వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇతర దేశాల్లో ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు తెలిపింది.1976లో కాంగోలో ఎబోలాను తొలిసారిగా



గుర్తించినప్పటి నుంచి ఇది 17వ సారి వ్యాప్తి చెందిందని డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. ప్రాథమిక నమూనాలలో అధిక పాజిటివిటీ రేటు, వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటం ఆందోళనకరంగా మారిందని పేర్కొన్నది. ఈ వైరస్‌కు ప్రత్యేకంగా అమోదించిన చికిత్సలు, వ్యాక్సిన్‌లు లేకపోవడంవల్ల దీనిని వెంటనే అరికట్టడం కూడా అసాధ్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. జాతీయ విపత్తు అత్యవసర నిర్వహణ యంత్రాంగాలను క్రియాశీలం చేయాలని ఆదేశించింది. సరిహద్దుల వెంబడి స్క్రీనింగ్ చేపట్టాలని ప్రపంచ దేశాలకు సూచించింది. అదే సమయంలో వైరస్ భయంతో సరిహద్దులను మూసివేయవద్దని, ప్రయాణ, వాణిజ్య ఆంక్షలు విధించవద్దని కోరింది. వైరస్ లక్షణాలు ఉన్నవారు ఇతర దేశాలకు వెళ్లవద్దని పేర్కొన్నది. వ్యాధి నిర్ధరణ అయిన వారిని వెంటనే క్వారంటైన్ చేసి.. వారితో సంబంధం ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని కాంగో ప్రభుత్వానికి సూచనచేసింది.

# పార్లమెంటరీ కమిటీల సమావేశాలకు ఎంపీల గైర్హాజరు

**న్యూఢిల్లీ మే 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పార్లమెంటరీ కమిటీల సమావేశాలకు ఎంపీలు తరచుగా గైర్హాజరవుతున్నారు. దీంతో కోరం లేక 5 కీలక సమావేశాలు వాయిదా పడ్డాయి. గత సెప్టెంబర్‌లో పునర్వ్యవస్థీకరించబడినప్పటి నుండి నిర్వహించిన 16 స్థాయి సంఘాలు, ప్రజా ఖాతాల కమిటీ (పిఎసి) సమావేశాలకు సగటున 53 శాతం మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. లోక్‌సభ వెబ్‌సైట్ లోని గణాంకాలు తెలిపాయి. పార్లమెంటరీ కమిటీలకు ఎంపీలు తప్పనిసరిగా హాజరుకావాలని ప్రధాని మోడీ స్పష్టం చేసినప్పటికీ.. ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం గమనార్హం. ఈ కాలంలో కనీస కోరం (కనీసం 11 మంది సభ్యుల హాజరు) లేకపోవడం వల్ల వేర్వేరు కమిటీలకు చెందిన ఐదు కీలక సమావేశాలు వాయిదా పడ్డాయి. ఇందులో 'టెలికాం తయారీ రంగంలో స్వావలంబన'పై చర్చించాల్సిన కమ్యూనికేషన్స్ అండ్ ఐటీ స్టాండింగ్ కమిటీ సమావేశంతో పాటు, జలవనరుల స్టాండింగ్ కమిటీకి చెందిన రెండు ముఖ్యమైన సమావేశాలు రద్దయ్యాయి. గతేడాది నవంబర్ 10న నమామి గంగే, జాతీయ నదీ పరిరక్షణ ప్రాజెక్టులపై చర్చించాల్సిన సమావేశం, అలాగే ఈ ఏడాది జనవరి 5, 2026న



పీఎంకేఎస్‌వై (పిఎంకెఎస్ వై ) నీటి నిర్వహణ, వాప్కోస్, ఎన్‌పీసీసీ సంస్థల పనితీరుపై సమీక్షించాల్సిన సమావేశాలు కోరం లేక వాయిదా పడ్డాయి. వీటితో పాటు ఏప్రిల్ 8, ఏప్రిల్ 22 తేదీల్లో భూ వనరులు, గిరిజన వ్యవహారాలు, గనుల మంత్రిత్వ శాఖల ప్రతినిధులతో జరగాల్సిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ స్థాయీ సంఘం సమావేశాలు కూడా సభ్యులు హాజరుకాకపోవడంతో నిలిచిపోయాయి. ప్రస్తుతం ప్రతి పార్లమెంట్ స్థాయి సంఘంలో 31 మంది సభ్యులు (లోక్‌సభ నుండి 21, రాజ్యసభ నుండి 10), అలాగే పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి)లో 22 మంది సభ్యులు (లోక్‌సభ నుండి 15, రాజ్యసభ నుండి 7) ఉన్నారు. అత్యంత ప్రాధాన్యత గల జాతీయ అంశాలపై చర్చించాల్సిన సమయాల్లో సభ్యుల గైర్హాజరు వల్ల కమిటీల పర్యవేక్షక బాధ్యతలకు ఆటంకం కలుగుతోంది.